## 19 నుంచి 25 వరకు మేడారానికి ప్రత్యేక బస్సులు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 18 : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 25 వరకు మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు హైదరాబాద్ డిపో-1 మేనేజర్ బి.క్రిష్ణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మేడారం జాతరకు భక్తుల రద్దీ దృష్ట్యా ఎక్కువగా బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు డిపో-1 పరిధిలోని సాధారణ రూట్లలో బస్సులను తక్కువగా నడిపి, ఆ బస్సులను మేడారానికి పంపిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి మక్తల్, టై రోడ్, రాయ్‌చూర్, హైదరాబాద్ టు యాద్గిర్, హైదరాబాద్ టు సెడమ్, హైదరాబాద్ టు గుల్బర్గా, హైదరాబాద్ టు బిచ్చుకుందా రూట్లలో బస్సులు తక్కువగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆయా రూట్లలోని ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## మార్చి 5న ఇంటర్నేషనల్ జాతీయ సదస్సు

రవీంద్రభారతి, ఫిబ్రవరి18: ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలపై నిపుణులతో మార్చి 5న రవీంద్రభారతిలో ఇంటర్నేషనల్ జాతీయ శాంతి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ హెచ్‌ఆర్.రహమాన్ వెల్లడించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇంటర్నేషనల్ జాతీయ శాంతి అవగాహన సదస్సులో 18 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. 3.5 లక్షల విద్యార్థులు, అధ్యాపకులకు ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలపై అవగాహన కల్పించామని, రాజస్థాన్, హైదరాబాద్ నగరాల్లో కూడా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సంవత్సరం హైదరాబాద్‌లో నిర్వహించడానికి కమిటీ వేశామని తెలిపారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్‌ట్రస్ట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మైనంపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఫాతిమా, మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలిగా డాక్టర్ శివపావని నియమితులయ్యారని ఆయన పేర్కొన్నారు.

## గ్రేటర్ @ 34.8 డిగ్రీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. అదే సమయంలో రాత్రి ఉష్ణోగ్రతల్లో తగ్గుదల చోటు చేసుకోవడంతో ఉదయం, రాత్రి వేళల్లో వాతావరణం కొంత చల్లగా ఉంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 34.8డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత 17.8డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 21శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## 25న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

మియాపూర్, ఫిబ్రవరి 18 : మియాపూర్ గాయత్రీ బ్రాహ్మణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న 13వ రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను మియాపూర్ జనప్రియా అపార్టుమెంట్స్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి మూర్తి ఆదివారం తెలిపారు. ఆసక్తి గలవారు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 99483 21233, 79814 13159, 92468 44496 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



గాంధీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట అపరిశుభ్రత నెలకొంది. వైద్యశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.

## ఆర్య సమాజ్ ఉద్యమ స్ఫూర్తి మరువలేం

### హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



మాట్లాడుతున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 18: నిజాం రజాకార్ల దోపిడీ, అరాచకాలకు వ్యతిరేకంగా ఆర్య సమాజ్ ఉద్యమకారులు చేసిన కృషిని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరువలేరని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం మహర్షి స్వామి దయానంద్ సరస్వతి 200వ జయంతి సందర్భంగా నిజాం కళాశాల నుంచి రవీంద్రభారతి వరకు భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన కేంద్ర ప్రభుత్వ కమిటీ తెలంగాణ ఆర్యసమాజ్ సభ్యులు డాక్టర్ డి. ధర్మతేజతో కలిసి జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ... కుల, మత భేదం లేకుండా ప్రతి ఒక్కరూ సమానమేనని చైతన్య పరిచేందుకు ఆర్య సమాజ్‌ను స్థాపించి ప్రపంచానికి వేదమే మూలం అని తెలిజేసిన మహోన్నతుడు మహర్షి దయానంద్ సరస్వతి అని కొనియాడారు. అనంతరం డి.ధర్మతేజ మాట్లాడుతూ... ప్రతి ఇంటిలో యజ్ఞం కార్యక్రమాన్ని చేపట్టి 200 స్లమ్ ఏరియాలు, దళిత వాడల్లో సామూహిక యజ్ఞాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాలో 200 యజ్ఞ కుండములతో బృహత్ యజ్ఞం, గో ఆధారిత ప్రాకృతిక వ్యవసాయం గూర్చి ప్రచారం చేయడంతో పాటు రైతులకు 200 మండలాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి బ్రహ్మానంద ఆచార్యులు, మాజీ డీఎస్పీ నళిని ఆర్య, సూర్య ప్రకాశ్, వినయ్ ఆర్య, నరేంద్ర ఆర్య, రామచంద్ర రాజు, భరత్ ప్రకాశ్, ప్రదీప్ జాజు, భక్తరామ్‌తో పాటు 20 జిల్లాల ఆర్య సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న బుక్ ఫెయిర్

### భారీగా తరలివచ్చిన పుస్తక ప్రియులు



బుక్ ఫెయిర్‌లో స్టాళ్లను సందర్శిస్తున్న పుస్తక ప్రియులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 : ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన 36వ జాతీయ పుస్తక ప్రదర్శన నేటితో ముగియనుంది. ఆదివారం కావడంతో పుస్తకప్రియులు భారీగా తరలివచ్చారు. స్టాల్స్ కలియతిరుగుతూ తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు. విభిన్న రకాల పుస్తకాలు అందుబాటులో ఉండటంతో పుస్తక ప్రేమికులతో స్టాల్స్ అన్నీ సందడిగా మారాయి. మరోవైపు రవ్వా శ్రీహరి వేదికపై పలు పుస్తకావిష్కరణ కార్యక్రమాలు జరిగాయి.

### డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి పుస్తకాల ఆవిష్కరణ..




డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఎన్టీఆర్ స్టేడియంలోని గద్దర్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. ఆంధ్రజ్యోతి పత్రిక ఎడిటర్ కె శ్రీనివాస్, వీక్షణం వేణుగోపాల్, ఆచార్య ఎన్.గోపి, సాహితీవేత్త పసునూరి రవీందర్ పుస్తక సమీక్షలో మాట్లాడుతూ... ఈ పుస్తకం తెలంగాణ సాహిత్య చరిత్రకు పెద్దబాలశిక్ష లాంటిదన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ఉపయోగపడే దినుసులాంటిదని చమత్కరించారు. డాక్టర్ సింగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుడిపాటి, కాసుల ప్రతాప్ రెడ్డి, డాక్టర్ ఎస్.రఘు, ఉప్పాల శ్రీరామ్ తదితరులు పుస్తకంపై ఉపన్యసించారు.



ప్రదర్శనలో పుస్తకాలను కొనుగోలు చేస్తున్న పుస్తక ప్రేమికులు



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న రిటైర్డ్ జస్టిస్ బి.ఈశ్వరయ్య, బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీ శంకర్ తదితరులు

### శివశంకర్ జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి

శివశంకర్ జీవితం, పోరాటం ఈ తరానికి ఎంతో అవసరమని, ఆయన జీవితాన్ని పాఠ్య పుస్తకాల్లో సిలబస్‌గా చేర్చాలని రిటైర్డ్ జస్టిస్ బి.ఈశ్వరయ్య తెలిపారు. ఆయన తెలుగు నేలపై జన్మించిన పూలే వారసుడన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఆదివారం పి.శివశంకర్ ఆత్మకథ 'అదొక్కటే ముగింపు' పుస్తకంపై చర్చాగోష్టి జరిగింది. ఈ కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.లక్ష్మణ్, శివశంకర్ తనయుడు డాక్టర్ వినయ్‌కుమార్, బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## అంతరంగపు ముచ్చట్లు పుస్తకావిష్కరణ



చిక్కడపల్లి, ఫిబ్రవరి 18: డాక్టర్ సూర్యదేవర రాధారాణి రచించిన అంతరంగపు ముచ్చట్లు పుస్తకావిష్కరణ సభ ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ ఎన్.గోపి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్త్రీవాద రచయిత ఓల్గా అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రఘు, డాక్టర్ ఎన్.జతిన్ కుమార్ సూర్యదేవర, రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల తనిఖీ..

### బినామీ డీలర్ల గుర్తింపు..

మేడ్చల్, ఫిబ్రవరి18(నమస్తే తెలంగాణ): రేషన్ షాపులను తనిఖీ చేసిన పౌరసరఫరాల అధికారులు బినామీలను గుర్తించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 619 రేషన్ దుకాణాలను పౌరసరఫరాల జిల్లా అధికారులు తనిఖీ చేసి నివేదిక సిద్ధం చేశారు. నివేదికలో బినామి డీలర్లు ఉన్నట్లయితే రేషన్ షాప్‌ను రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రేషన్ షాపుల్లో నిత్యావసర వస్తువులను అక్రమంగా బయటకు తరలిస్తున్నట్టు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు బినామీ డీలర్లను గుర్తించేందుకు తనిఖీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. నివేదిక ఆధారంగా త్వరలోనే బినామీ రేషన్ డీలర్లపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో 619 రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్నారు. జిల్లాలో రేషన్ కార్డులు 5,23,938 ఉన్నాయి.

### రేషన్ షాపుల భర్తీ ఎప్పుడు.?

జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ షాపుల భర్తీ ఎప్పుడు చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రేషన్ కార్డులు ఇస్తామన్న హామీ మేరకు ఇటీవలే ప్రజలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.



ఒక వేళ నూతన రేషన్ కార్డులు అందిస్తే ప్రస్తుతం ఉన్న రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులు అందించడం ఇబ్బందిగా మారుతుంది. ఇప్పటికే జిల్లాలో 27 రేషన్ షాపులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న షాపులను త్వరగా భర్తీ చేసి ఇబ్బందులు తీర్చాలని వినియోగదారులు కోరుతున్నారు. కాగా రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న వారు ఎప్పుడిస్తారని ఎదురు చూస్తున్నారు.

## బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కత్తి వెంకట స్వామి

చిక్కడపల్లి, ఫిబ్రవరి18: ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి జీతభత్యాలు చెల్లించాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం చైర్మన్ కత్తి వెంకట స్వామి పేర్కొన్నారు. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ స్వామి మాట్లాడుతూ.. అన్ని యూనివర్సిటీలు , కాలేజీల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అలాగే బీఈడీ, గురుకుల స్థానిక విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ, అధ్యాపక, బోధనేతర సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.వేణు, రజనీ, గోపీనాథ్, అరుణ్‌కుమార్, అబ్దుల్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క, సారలమ్మ జాతరకు సెలవు ప్రకటించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 18 : ఆదివాసి ప్రజల ఆరాధ్య దైవం మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సాగబోయిన పాపారావు డిమాండ్ చేశారు. ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసుల జాతర జరుగుతోందన్నారు. ఈ జాతరకు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. రాష్ట్ర ప్రజలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాల ఆదివాసీ ప్రజలు వనదేవతలను దర్శించుకుంటారన్నారు. జాతర పర్యవేక్షణ కమిటీలో ఆదివాసులతో పాటు గిరిజనేతరులకు అవకాశం కల్పించే యోచనను విరమించుకోవాలని కోరారు. మేడారం సమ్మక్క సారలమ్మ ట్రస్టు బోర్డులో అందరికీ అవకాశం కల్పించాలన్నారు.

## బీజేపీని ఓడించకపోతే ప్రజాస్వామ్యానికి ప్రమాదమే ..

కవాడిగూడ, ఫిబ్రవరి 18: రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే ప్రజాస్వామ్యం మరింత ప్రమాదంలోకి నెట్టివేయబడుతుందని పలు ప్రజాసంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ముస్లిం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈవీఎంలు వద్దు- బ్యాలెట్ ముద్దు అంటూ మహాధర్నా చేశారు. ఈ ధర్నాలో ఫెడరేషన్ నాయకుడు నర్సింగ్ రావు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ నాయకుడు జి.శంకర్, బంద్ సొసైటీ వ్యవస్థాపకుడు పల్లెల వీరస్వామి, లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాసురామ్ నాయక్, ఎస్సీ ఉపకులాల రాష్ట్ర నాయకుడు చింతల రాజలింగం హాజరై మాట్లాడారు. ఓబీసీలు, మైనారిటీలకు




ధర్నాలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగాన్ని అమలు చేయకుండా మనుధర్మశాస్త్రాన్ని అమలు చేస్తూ దేశంలో ఎలాంటి సమస్యలు లేనట్లుగా దేశ భక్తి భావాలను పెంపొందిస్తూ, ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల కమిషన్ స్పందించి ఈవీఎం పద్ధతిని రద్దు చేసి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు దళిత సంఘాల నాయకులు ఎన్.విల్సన్, పి.కన్నయ్య, పి.జగన్నాథం, మహేశ్వర్ రాజు, పులి కల్పన, లక్ష్మణ్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

## అయోధ్య రాముడిని దర్శించుకున్న తలసాని



సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : అయోధ్య రామ మందిరాన్ని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకున్నారు. అయోధ్య ఎమ్మెల్యే రాంచందర్ బిదాయితో కలిసి బాలరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం రామ్ రసోయ్ ట్రస్ట్ సభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించారు. అనంతరం హనుమాన్‌ను దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గురూజీ రాజుదాస్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

## కుల గణనలో ఎస్సీ ఉపకులాల వాటా తేల్చాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 18 : ఎస్సీల కులగణన చేపట్టి ఉపకులాల వాటా తేల్చాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్సీల కోసం 30 ఏండ్ల నుంచి పోరాడుతున్నామని చెప్పుకుంటున్న నాయకులు ఉపకులాల ఊసెత్తడం లేదన్నారు. చట్టసభల్లో ఎస్సీ ఉపకులాలకు అవకాశమే రాలేదని, ఎమ్మెల్యే, ఎంపీ అయిన దాఖలాలు లేవన్నారు. గతంలో జస్టిస్ రామచంద్రరాజు, జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్‌లు మాల, మాదిగ కులాలు వారి జనాభా నిష్పత్తి కంటే అధికంగా లాభాలు పొందారని, మిగతా 57 కులాలు అన్యాయానికి గురయ్యాయని వారు నివేదికలో స్పష్టం చేశారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు, రాష్ట్ర ప్రభుత్వాలే వర్గీకరణ చేపట్టాలని సూచించే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో మాల మాదిగలతో సంబంధం లేకుండా57 కులాలకు రావాల్సిన వాటాను ఇవ్వాల్సిందేనన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తీగల అశోక్ కుమార్, ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి నాయకులు టీఎన్ స్వామి, సత్యనారాయణ, రామారావు, నాగయ్య, రాములు, రాజారామ్, రవీందర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బైరి వెంకటేశం

## ఆత్మగౌరవ ఉద్యమాలకు భాగ్యరెడ్డి వర్మ ఆద్యుడు

### చాదర్‌ఘాట్‌లోని ఆది హిందూ భవన్‌లో భాగ్యరెడ్డి వర్మ స్మారకోపన్యాసం

సుల్తాన్‌బజార్,ఫిబ్రవరి 18: సామాజిక, ఆర్థిక, ఆత్మగౌరవ ఉద్యమాలకు భాగ్యరెడ్డి వర్మ ఆద్యుడని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం చాదర్‌ఘాట్‌లోని ఆది హిందూ భవన్‌లో నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ స్మారకోపన్యాసం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రథమ ఆంధ్ర మహాసభ, తెలంగాణ సాయుధ పోరాటం, నిజాం వ్యతిరేక ఉద్యమానికి భాగ్యరెడ్డి వర్మ మొదలు పెట్టిన ఆది హిందూ ఉద్యమమే పునాది అని అభిప్రాయపడ్డారు. 1930లో కేంద్ర బిందువుగా నిలిచిన ప్రథమ ఆంధ్ర మహాసభకు హాజరైన భాగ్యరెడ్డి వర్మ అణగారిన ప్రజల అణచివేతను నిరసించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆర్య సమాజం, బ్రహ్మ సమాజంతో కలిసి పనిచేస్తూనే 1917లో విజయవాడలో జరిగిన పంచమం మహాసభకు వక్తగా వెళ్లి సమాజాన్ని చైతన్యం చేసిన నాయకుడిగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యరెడ్డి వర్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బాల నర్సింహ, ట్రస్టీ జ్ఞాన ప్రకాశ్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి అజయ్ గౌతమ్, కరస్పాండెంట్ శ్రీలత గౌతమ్, కార్యవర్గ సభ్యులు బి.సుధాకర్, జ్ఞానేశ్వర్, విజయ్, గద్దర్ కుమారుడు సూర్య కిరణ్, సీనియర్ జర్నలిస్టు ఆశ శ్రీరాములు, సీనియర్ అధ్యాపకులు జాకబ్, నారాయణ పాల్గొన్నారు.




ఆది హిందూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్